జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్గొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
గురువారం 17 సెప్టెంబర్ 2026 పేజీలు:14





నల్లగొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తా..

02





# గ్రామాల్లో గుప్పుమంటున్న నాటుసారా!

- తెల్లవారుజామునే తాగుడుకు తెర...!
- నాటుసారాకు బలవుతున్న యువత
- చిన్న వయసులోనే వితంతువులవుతున్న యువతులు
- సారా.. అంబర్.. పాన్ పరాగ్ యువత జీవితాలతో చెలగాటం!
- మత్తులో మునిగిపోతున్న పల్లెలు
- తనిఖీలు తూతూమంత్రమేనా..?
- సారా విక్రయాలపై అధికారుల నిఘా ఎక్కడ..?



**తుంగతుర్తి, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):**

పల్లెల్లో నాటుసారా జోరు పెరుగుతోందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాలు, తండాల్లో కొన్నిచోట్ల ఉదయం నాలుగు గంటల నుంచే సారా విక్రయాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం మత్తుకు యువత బానిసలుగా మారుతుండటం తో కుటుంబాల్లో ఆందోళన నెలకొంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా 2 లో

# నల్లగొండను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తా..

మొదటిపేజీ తరువాయి

## - మంత్రి కోమటిరెడ్డి సహకారంతో కార్పొరేషన్ మరింత అభివృద్ధి..

## - మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి..

## - అర్హులైన వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు..- నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్గొండ సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి):**





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల స్థానంలో ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కార్డులను తీసుకువచ్చిందని నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు.బుధవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పచ్చల సోమేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డును పంపిణీ చేసిందని పేర్కొన్నారు.రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులుగా డిజిటలైజేషన్ చేసి పంపిణీ చేస్తుందని తెలిపారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 48 డివిజన్లో మొత్తం 62,853 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని తెలిపారు.మూడు రోజుల పాటు అన్ని డివిజన్లో వీటిని పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో స్మార్ట్ రేషన్ కార్డుల విధానం అమలు చేస్తున్నామని, దీనివల్ల రేషన్ పంపిణీలో పారదర్శకత పెరిగి అవకతవకలకు అడ్డుకట్టపడుతుందని వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ రేషన్ షాపులో బియ్యం తీసుకోవాలని సూచించారు.గత ప్రభుత్వ హాయంలో రేషన్ కార్డుల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేయగా వాటిని ఎవరు సరిగ్గా తినేవారు కారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఇది ఎంతో గర్వకారణమని అన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ప్రత్యేక నిధుల ద్వారా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను స్మార్ట్ సిటీగా మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్పొరేషన్ ను అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.ఇప్పటికే పట్టణంలోని అన్ని డివిజన్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్డు పనులు చేపట్టడం జరిగిందని, మిగిలిన పనులు కూడా జరుగుతున్నాయని అన్నారు. పానగల్ పచ్చల సోమేశ్వరాలయం నుంచి బైపాస్ రోడ్డు కూడా వేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలోని రూ.100 కోట్లతో చేపడుతున్న బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ గుట్టల ఘాట్ రోడ్డు పనులు చురుకుగా జరుగుతున్నాయని అన్నారు.దీంతో నల్లగొండను పర్యటకంగా మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందని వెల్లడించారు. స్థానిక కార్పొరేటర్ ఆలకుంట్ల నాగరాజు (చిట్టి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమీర్ ,ఆర్డీవో అశోక్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వంశీకృష్ణ, తహసిల్దార్ పరశురాములు, పలువురు కార్పొరేటర్లు, వార్డ్ ఆఫీసర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో గుప్పుమంటున్న నాటుసారా!

మొదటిపేజీ తరువాయి

### యువత జీవితాలపై మత్తు ప్రభావం

చిన్న వయసులోనే మద్యం, నాటు సారాకు అలవాటు పడుతున్న యువతలో కొందరు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మద్యం వినియోగం కారణంగా కుటుంబ ఆర్థిక పరిస్థితులు దెబ్బతినడంతో పాటు భార్యాభర్తల మధ్య విభేదాలు, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయని అంటున్నారు. కొన్ని కుటుంబాల్లో యువకులు మృత్యువాత పడటంతో వారి భార్యలు చిన్న వయసులోనే వితంతువులుగా మారుతున్న విషాద పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

### సారా ఒక్కటే కాదు.. పొగాకు ఉత్పత్తులూ ప్రమాదమే

నాటు సారాతో పాటు అంబర్, పాన్ పరాగ్ తదితర పొగాకు ఉత్పత్తులను నమలడం యువతలో అలవాటుగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం నోటి క్యాన్సర్ సహా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే.

### తెల్లవారుజామునే మత్తు వాతావరణం

కొన్ని గ్రామాలు, తండాల్లో తెల్లవారుజామునే సారా విక్రయాలు ప్రారంభమవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులకు వెళ్లాల్సిన యువకులు సైతం ఉదయాన్నే మద్యం సేవిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో పని సామర్థ్యం తగ్గడం, కుటుంబ ఆదాయంపై ప్రభావం పడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తనిఖీలు ఎక్కడ..?

నాటుసారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ అవి "తూతూమంత్రంగానే



ఉంటున్నాయంటూ" కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు అమ్యామ్యాలకు లొంగి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

### యువతను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది..?

పల్లెల్లో నాటుసారా, అక్రమ మద్యం, పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీస్, వైద్య, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్రమ విక్రయాలపై నిరంతర నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### మత్తు కోసం ఒక్కరోజు పెట్టే ఖర్చు కంటే...ఆ మత్తు వల్ల కుటుంబం చెల్లించే మూల్యం ఎన్నో రెట్లు ఎక్కువ.

ఇది కేవలం సారా సమస్య కాదు... ఒక తరం భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న!

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ:సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి

**వలిగొండ సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి న్యూస్):**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా అరూరు గ్రామంలో జక్కిడి రంగారెడ్డి స్మారక స్థూపాల వద్ద అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పేదల భూ సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను నేటి తరాలు స్మరించుకోవాలని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కార్యవర్గ సభ్యులు పోలేపాక యాదయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల సాయికుమార్, బుర్ర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలి

- టెక్నాలజీని జ్ఞానం,లక్ష్య సాధనకు ఉపయోగించాలి
- విద్యార్థి దశలో వేసుకునే పునాదులే భవిష్యత్ విజయాలకు బాటలు
- పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎక్స్‌పర్ట్ టాక్
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ








**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):**
విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా క్రమశిక్షణతో నిరంతరం కృషి చేయాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ సూచించారు.విద్యార్థి దశలో వేసుకునే మంచి పునాదులే భవిష్యత్తులో విజయాలకు బాటలు వేస్తాయని అన్నారు.సూర్యాపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన 'ఎక్స్‌పర్ట్ టాక్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని,దానిని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు.చదువు కేవలం ఉద్యోగం పొందేందుకు మాత్రమే కాకుండా జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునే సాధనమని పేర్కొన్నారు.పీఎం శ్రీ పాఠశాలగా ఎంపిక కావడం విద్యార్థులకు లభించిన మంచి అవకాశమని,పాఠశాలలో అందుబాటులో ఉన్న విద్యా వసతులు,ఉపాధ్యాయుల బోధనను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.మహానుభావులు,గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు.కలలు కనడంతో పాటు వాటిని సాకారం చేసుకునేందుకు క్రమశిక్షణతో సాధన చేయాలని సూచించారు.ఆత్మన్యూనతా భావాన్ని విడిచిపెట్టి ఆత్మవిశ్వాసంతో లక్ష్యాల వైపు అడుగులు వేయాలని చెప్పారు.తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు పాఠశాలకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి**

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా,సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థుల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ తెలిపారు.అయితే సోషల్ మీడియా ప్రభావంతో చెడు అలవాట్లకు లోనుకాకుండా టెక్నాలజీని చదువు,జ్ఞానం, నైపుణ్యాభివృద్ధి,లక్ష్య సాధనకు ఉపయోగించుకోవాలని సూచించారు.క్రమశిక్షణ,పట్టుదల,నిరంతర సాధనతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు సమాజానికి సేవ చేసే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని ఎస్పీ ఆకాంక్షించారు.తమ ప్రతిభను సమాజ ప్రగతికి ఉపయోగించే స్థాయికి ఎదగాలని సూచించారు.

**మహిళలు,బాలికల రక్షణకు పోలీసుల కృషి**

మహిళలు,బాలికల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ తెలిపారు.సమస్యలు ఎదురైనప్పుడు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.షీ టీమ్స్,భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మహిళలు,బాలికలకు అండగా నిలిచేలా పోలీస్ శాఖ పనిచేస్తోందన్నారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, పిన్,పాస్‌వర్డ్,బ్యాంకు వివరాలు వెల్లడించవద్దని తెలిపారు.ఉచితాల పేరుతో వచ్చే సందేశాలు,అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

**డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి**

విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ,మంచి లక్ష్యాలు కలిగిన వారితో స్నేహం చేయాలని సూచించారు.తోటి విద్యార్థులను గౌరవిస్తూ స్నేహపూర్వక వాతావరణంలో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్,సీఐ వెంకటయ్య,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్,సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు యాదవేందర్ రెడ్డి, సాయిరాం, హరికృష్ణ, భరోసా ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్ఐ నీలిమ, పాఠశాల హెడ్‌మాస్టర్ గోలి పద్మ, పీడీ విశ్వజ్ఞాచారి, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు సునీత,సుమతి, వెంకటేశ్వర్లు,శ్రీనివాస్‌రావు,సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవే లక్ష్యం

- నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు - పిల్లుట్ల రఘు



**గరిడేపల్లి,సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి):**
వినాయక చవితిని పురస్క రించుకుని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు గరిడేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.కాచవారిగూడెం,కాల్వ పల్లి,రాయినిగూడెం, కీతవారిగూడెం, అప్పన్నపేట,అబ్బిరెడ్డిగూడెం,లక్ష్మీ పురం,సర్వారం గ్రామాల్లో వినాయక విగ్రహాలను పంపిణీ చేసి,మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ఆరేళ్లుగా వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని, ఇప్పటివరకు నియోజక వర్గంలో సుమారు 400 విగ్రహాలను అందించినట్లు తెలిపారు.గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలు, యువత, స్థానిక నాయకుల సమస్యలను తెలుసుకుంటున్నామని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు,ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి

గురువారం 17 సెప్టెంబర్ 2026

# మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ

**ఆరోగ్య పరిస్థితిపై ఆరా...త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట పట్టణంలోని పిల్లలమర్రి 12వ వార్డుకు చెందిన మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్ గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది ఆయనను పరామర్శించారు.శ్రీనివాస్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయనకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ కోడి నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్, శ్రీ దండు మైసమ్మ దేవాలయ మాజీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుగులోతు నాగునాయక్, పడిదల రవికుమార్, స్థానిక నాయకులు సాదక్, కొండ వెంకన్న, సంద సైదులు, చిలుక ఆనంద్, చింత సైదులు, సురేష్, వెంకట్‌లాల్, చింతలూరు సతీష్, కృష్ణయ్య తాలింపు, మదగోని కేశవులు, చెరుకుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

**- 14వ మైలు చెక్ పోస్ట్ వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**

**- హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి**

**హాలియా, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):**

గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రజలు,భక్తులు ప్రశాంత వాతా వరణంలో జరుపుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,మున్సిపల్ కమిషనర్ కె.రవీందర్ రెడ్డి ఆదేశించారు.నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఆదేశాల మేరకు బుధవారం అనుముల మండల పరిధిలోని 14వ మైలు చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన గణేష్ నిమజ్జన ఏర్పాట్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నిమజ్జన ప్రాంతంలో అవసరమైన పోలీస్ భద్రత,విద్యుత్ దీపాలు (లైటింగ్)పారిశుద్ధ్య చర్యలతో పాటు భక్తులకు కావాల్సిన మౌలిక వసతులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అనుముల మండల తహశీల్దార్ పూర్ణచందర్,ఎంపీడీవో మజీద్, సీఐ రాఘవరావు,ఎస్ఐ సాయి ప్రశాంత్,ఆర్ఐ నవీన్ కుమార్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కథల్‌గూడ సబ్ సెంటర్‌లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ..

**- రికార్డుల నిర్వహణ, మందుల నిల్వపై ప్రత్యేక దృష్టి..**

**- నాణ్యమైన వైద్య సేవలు అందించాలి..- డీఎంహెచ్‌ఓ డా. కె. రాహుల్**

**నల్గొండ, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి):**



రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కథల్‌గూడ సబ్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. రాహుల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లోని రికార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వ, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. విధుల్లో ఉన్న వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడి సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.అన్ని రికార్డులు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. అత్యవసర, ముఖ్యమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ సెంటర్ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందించాలని, ప్రజల ఆరోగ్య అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, ప్రభుత్వ ఆరోగ్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డా. రాహుల్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. నాగేష్, హెచ్ఈఈఓ అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

**- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**- 17న నల్గొండలో ఘనంగా వేడుకలు.. ముఖ్యఅతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.**

**- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ..**

**నల్గొండ సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి):**









తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 17న (గురువారం) నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకాను న్నారు.బుధవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 10 గంటలకు మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది ఉదయం 9.30 గంటలకే హాజరు కావాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే వారికి తాగునీరు, టెంట్లు, కుర్చీలు, విద్యుత్ సరఫరా, పరిశుభ్రత, ప్రజా ప్రసార వ్యవస్థ, ప్రథమ చికిత్స తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం మంత్రి ప్రజలను ఉద్దేశించి సందేశం ఇవ్వనుండగా, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు.వేడుకలకు పోలీసుల తరఫున గౌరవ వందనం, బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయక కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, డీఆర్వో దశరథ్, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 18, 19వ తేదీల్లో నల్లగొండలో జర్నలిస్టుల దీక్షలను విజయవంతం చేయండి

## - నల్లగొండ నగర జర్నలిస్టులంతా దీక్షలలో భాగస్వాములు కావాలి..

## - ఇంటి స్థలాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కదలిరండి..

## - ఈ 30 ఏళ్ల పోరాటంలో విజయమే లక్ష్యంగా కలిసి నడుద్దాం..

## టీయూడబ్ల్యూజే ( ఐజేయు) జిల్లా కమిటీ పిలుపు..

**నల్లగొండ, సెప్టెంబర్ 16, (ప్రజా జ్యోతి):**

టీయూడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో ఈనెల 18,19వ తేదీల్లో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జరిగే జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత 30 సంవత్సరాలుగా నల్లగొండ లో పనిచేసే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో జర్నలిస్టులు తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి చెందిన జర్నలిస్టులు ఇంటి స్థలంతో పాటు ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నల్లగొండ నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టుల బాధలను ప్రభుత్వం ఇప్పటికైనా అర్థం చేసుకొని ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18,19వ తేదీల్లో రెండు రోజులపాటు జరిగే రిలే నిరాహార దీక్షలో నల్లగొండ పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, చిన్న పత్రికల జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 18వ తేదీన ప్రతిపక్ష పార్టీల నాయకులు దీక్షలకు సంఘీభావం తెలియజేస్తారని, 19వ తేదీన దీక్షా శిబిరాన్ని అధికార పార్టీ నేతలు ప్రజాప్రతిని సందర్శించి మద్దతు పలకనున్నారని తెలిపారు. నల్లగొండలో జరిగే దీక్షలకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున వచ్చి సంఘీభావం తెలియజేయాలని కోరారు.

## గణనాథుడి సేవలో అన్నదాన మహోత్సవం

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి):**

పట్టణ కేంద్రంలోని టై అండ్ డై అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ పంచమహారాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నదాతలుగా మున్సిపల్ చైర్మన్ తడక లతా వెంకటేశ్వర్లు, కర్నాటి సుధా బాలరాజు, ఈపూరి ముత్యాలు పద్మ, ముస్కూరి నరసింహ లత, గంజి బాలరాజు నాగలక్ష్మి, సీతకృష్ణ పద్మ తదితరులు సహకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, ఏకేఎల్‌బీ మర్చంట్ గౌరవాధ్యక్షుడు భోగ విష్ణు హాజరై మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఈపూరి ముత్యాలు, ఉపాధ్యక్షుడు గంజి బాలరాజు, సహాయ కార్యదర్శి గోలి యాదగిరి, సీతకృష్ణ, సీత లక్ష్మణ్, కడవేర సత్యనారాయణ, కడవేరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





## చిన్న పంగి నర్సయ్య మరణం తీరని లోటు

**పెన్ పహాడ్ సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి);**

పేద కుటుంబము లో పుట్టిన చిన్నపంగి నర్సయ్య ఎర్ర జెండా చేత పేదల కొరకు పోరాడి చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోవడం పార్టీ కి కుటుంబాన్ని కి తీవ్ర విషాదాన్ని కలిగించిందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు విజ్జు కృష్ణన్ అన్నారు. బుధవారం పెన్ పహాడ్ మండలంలోని చీదెళ్ల గ్రామంలో సిపిఎం జిల్లా నాయకులు చినపంగి నర్సయ్య సంతాప సభ జరిగింది. ఈ సభల్లో విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ సాయుధ పోరాట యోధుల వారసత్వాన్ని కొనసాగించిన చిన పంగ నర్సయ్య ఆశయ సాధనకు ఎర్ర జెండా చేత బట్టి మను వాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ సంస్థలకు లాభాలు తెచ్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. అఖిల భారత కిసాన్ సభలు నల్లగొండ జిల్లా కేంద్రంలో డిసెంబర్ లో జరుగుతున్న సందర్భంగా రైతు జాతా సూర్యాపేట జిల్లా లో జరుగుతోంది.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించిన నర్సయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఆయన అన్నారు.. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి వెంకట్ ,సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు,రైతు సంఘం అద్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్,సాగర్, నెమ్మాది వెంకటేశ్వర్లు,యం రాములు , రవి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, షేక్ సైదా ,బుర్రి శ్రీరాములు,ముత్యాలు,కే వెంకటనారాయణ,గుంజ వెంకటేశ్వర్లు,చంద్రయ్య, మడ్డి అంజి బాబుగౌడ్ , బొమ్మిరెడ్డి గోపిరెడ్డి,గుర్రం గోపాల్ రెడ్డి,స్వరాజ్యం,ఇరుగు రమేష్,పిరయ్య అడివయ్య, లక్ష్మి మరియు కుటుంబ సభ్యులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.



## నకిరేకల్ పట్టణంలో రెడ్డి జాగృతి విస్తృతస్థాయి సమావేశం

**నకిరేకల్, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి):**

నకిరేకల్ మండల కేంద్రంలోని నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్‌లో రెడ్డి జాగృతి మండల విస్తృతస్థాయి సమావేశం, పరిచయ వేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టం గారి మాధవరెడ్డి, వ్యవస్థాపక సభ్యులు నీరుడు దయాకర్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు సూదిని జైపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డితో పాటు మండల, మహిళా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నకిరేకల్ మహిళా మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా లోకసాని అనితారెడ్డి, కార్యదర్శిగా గార్లపాటి అరుణ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ట్రాస్మా చైర్మన్ కందాల పాపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షులు ఏమిరెడ్డి నర్సిరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు జీనుగు జ్యోతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రేగట్టే శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విజయరెడ్డి, జిల్లా సహాయ కోశాధికారి మైనంపాటి అరుణ, నల్గొండ మండల అధ్యక్షులు సోమిడి కర్ణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కృషి..

## - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

## - ప్రజా భద్రతే లక్ష్యం.. సిబ్బంది సంక్షేమమే బాధ్యత..

## - వర్షంలో విధులకు రక్షణగా రెయిన్ కోట్స్.. జిల్లా ఎస్పీ..

**నల్లగొండ సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి):**




పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వర్షాకాలంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రెయిన్




కోట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, పెట్రోలింగ్ తదితర విధుల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రత కోసం విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి అవసరమైన రక్షణ పరికరాలు, మౌలిక సదుపాయాలు కల్పించడం శాఖ బాధ్యత అని పేర్కొన్నారు.సిబ్బంది తమ ఆరోగ్యం, సంక్షేమంపై శ్రద్ధ వహించాలని, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు సంతోష్, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోటి వెంకటయ్య యాదవ్‌కు నివాళి

**నల్లగొండ సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

కేతేపల్లి: మండలంలోని కొర్లపాడు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోటి వెంకటయ్య యాదవ్ మృతి చెందగా, ఆయన భౌతికకాయంపై కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి తదితరులు వెంకటయ్య యాదవ్ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొర్లపాడు మాజీ సర్పంచ్ కుమ్మరి నాగయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి, సైదులు, ఉపేందర్ రావు, లింగరాజు, అంజయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**ఆలేరు సెప్టెంబర్ 16( ప్రజా జ్యోతి)**

కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరీ అశోక్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో నిర్వహించిన తిరంగా బైక్ ర్యాలీ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలోనే మరుపురాని రోజని, నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి కలిగిన రోజని ఈ విమోచన కోసం పోరాడిన వీరులు,, అమరవీరులు, ప్రజా ఉద్యమ నాయకుల త్యాగాలను మనము ఎప్పటికీ మరువలేమన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ పోలో ద్వారా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఇది తెలంగాణ ప్రజల స్వేచ్ఛా ఆకాంక్షలకు విజయాన్ని అందించిన చారిత్రాత్మక ఘట్టం అని తెలిపారు. ఇలాంటి రోజుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గుర్తించి తెలంగాణ విమోచన దినోత్సవం గా ప్రకటిస్తే రాష్ట్రంలోని అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా ఓటు రాజకీయాలు చేస్తూ కాల యాపన చేస్తున్నయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17 ను తెలంగాణ విమోచన దినోత్సవం గా అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు సేవ చేసినందుకు గాను, సెప్టెంబర్ 17 మోడీ జన్మదిన



సందర్భంగా"సేవ సంకల్ప అభియాన్" కార్యక్రమం ద్వారా నెల రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు కార్యక్రమాలు చేనునట్లు ఆయన తెలిపారు. ఆలేరు ప్రభుత్వ పాఠశాల నుండి దుర్గమ్మ గుడి వరకు తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య జిల్లా కిషోర్ మోర్చా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్ రెడ్డి జిల్లా కార్యదర్శి కామిటికారి అసెంబ్లీ కన్వీనర్ చిరిగి శ్రీనివాస్ మండల పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్ నంద గంగేష్ కౌన్సిలర్ పాశికంటి సంపత్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమార్ స్వామి జిల్లా నాయకులు




వడ్డేమాన్ నరేందర్ ఐడియా శ్రీనివాస్ తునికి దశరథ నరసింహారెడ్డి తోట మల్లయ్య సుధ గాని రాజు కటికే వెంకటేష్ కాంద్రాజు శ్రీనివాస్ కళ్లెపు రాజు ప్రధాన కార్యదర్శులు ఎలగల వెంకటేష్ సుంకరి సృజన్ శేషత్వం అమరేందర్ జంపాల శ్రీనివాస్ కంతుల శంకర్ మిట్టపల్లి భాస్కర్ మాస పేట రాజు వడ్డేపల్లి కిషన్ శాంతి రెడ్డి నేరెళ్ల రాజు ఐలి సందీప్ మంత్రి సాయి ప్రసాద్ గడ్డం సందీప్ అంకం రాజు శ్యామల శ్రీకాంత్ , కటకం నందం, ఎగిరి సంపత్, కంతుల శంకర్, మైదం భాస్కర్, సుక్కరాజు, గుర్రం నరసింహులు, రచ్చ రాము, కరుణాకర్ పరమస్వామి, పిండం స్వామి, పేరపు ఆనంద్, శ్రావణ్ గిరిపోయిన పరశురాములు తదితరులు పాల్గొన్నారు.





# గణేష్ నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

## - అధికారులను ఆదేశించినఆర్డీవో

**దామరచర్ల, సెప్టెంబర్ 16, (ప్రజాజ్యోతి):**

దామరచర్ల మండలం వాడపల్లి కృష్ణ నది వంతెన వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పక్కద్బందిగా చేయాలని మిర్యాలగూడ ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. వాడపల్లి లోని కృష్ణనది పైన వంతెన వద్ద ఆనవాయితీగా మిర్యాలగూడ ప్రాంత వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తుంటారు. అందులో భాగంగా ఈసారి నిమజ్జనానికి అనుకూలంగా బారికేడ్లను ఆర్ అండ్ బి అధికారులు, విద్యుత్ సరఫరాను ట్రాన్స్కో అధికారులు, ట్రాఫిక్ నియంత్రణ శాంతిభద్రతల పర్యవేక్షణను పోలీసులు కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట దామరచర్ల తహసీల్దార్ జవహర్లాల్ నాయక్, ఆర్ అండ్ బి అధికారులు, మండల పంచాయతీ అధికారి, పోలీసు అధికారులున్నారు.

# నూతన గృహం ముందు క్షుద్ర పూజల కలకలం

### భయాందోళనలో కుటుంబ సభ్యులు కాలనీవాసులు

**భువనగిరి,సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి)**



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో స్థానిక,అర్బన్ కాలనీ లో గత కొన్ని రోజుల నుండి వల్లందాస్,రంజిత్ కుమార్ మచ్చందర్ కోట అమరేందర్ వారి నూతన గృహ నిర్మాణం కట్టి నప్పటి నుండి,వారి ఇంటి ముందు నల్ల బట్ట నిమ్మకాయలు బొమ్మ మరియు కుంకుమ పసుపు,ఇలాంటివి కనిపిస్తున్నాయని కుటుంబ సభ్యులు,వాటిని తీసి పడేస్తున్నారు.కానీ వాళ్ళ పిల్లలకు అనారోగ్యంతో కావడం తో ఎవరో గుర్తు తెలియని,వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారని, స్థానిక వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్,దృష్టికి తీసుకెళ్లగా వారి సహకారంతో పోలీసులను ఆశ్రయించడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఇలాంటి క్షుద్ర పూజలు చేయడం చాలా బాధ కరమైన విషయమని దీనితో తమ కుటుంబ సభ్యులు తీవ్ర అనారోగ్యనికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పోలీసులు గుర్తించి వారిని వెంటనే పట్టుకొని న్యాయం చేయాలని కోరారు.అలాగే వార్డు కౌన్సిలర్ మాట్లాడుతు ఇటువంటి సంఘటనలు జరగడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురి అవుతున్నారని వెంటనే పోలీసులు గుర్తించి వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.



# సాగర్ ఎడమ కాలువ లో మహిళ మృతదేహం లభ్యం

**సెప్టెంబర్ 16 వేములపల్లి (ప్రజాజ్యోతి) :-**

మండల కేంద్రంలో గల సాగర్ ఎడమ కాలువ లో గోగువాని గూడెం సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యంఅఇంది. ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అనంతరం ఏరియా ఆసుపత్రి కి తరలించామని తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు వేములపల్లి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాని సూచించారు.



# కేజీబీవీలో బాలికలకు పోషకాహారంపై అవగాహన





**ఆత్మకూర్ (ఎస్),సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి):**

ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 'బేటీ బచావోబేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థినులకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా,శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ కిశోర బాలికలు శారీరక,మానసికంగా దృఢంగా ఎదగాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు.బాలికల విద్య,సంరక్షణతో పాటు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.'బేటీ బచావోబేటీ పడావో' లక్ష్యాలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణ మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.స్థానికంగా లభించే ఆకుకూరలు, కూర గాయలు,పండ్లు, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు.సమతుల్య ఆహారంతో విద్యార్థినులు చదువులు,క్రీడల్లో చురుగ్గా రాణించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సరస్వతి,మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్, పాఠశాల సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

# సున్నిత ప్రాంతాల్లో గణేష్ మండపాలను పరిశీలించిన...జిల్లా ఎస్పీ

### - ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి..

### - ఎస్పీ శరత్ చంద్ర పవార్









**నల్లగొండ టౌన్ సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి):**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని సున్నిత, మిశ్రమ జనాభా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ బుధవారం పరిశీలించారు. మండపాల నిర్వాహకులతో మాట్లాడి భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించాలని, మండపాల వద్ద 24 గంటల పాటు వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని తెలిపారు. సౌండ్ సిస్టమ్‌ను నిబంధనల ప్రకారం వినియోగించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ: పాఠశాలలు, కళాశాలలకు గైర్హాజరై మండపాల వద్ద ఉండే మైనర్ విద్యార్థులపై నిర్వాహకులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ కోరారు. విద్యార్థులకు తల్లిదండ్రులు, నిర్వాహకుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి విద్య ప్రాముఖ్యతను వివరించనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా వదంతులను నమ్మకుండా, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ కే. శివరాం రెడ్డి, ఎస్బీ సీఐ నాగరాజు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ్ పై విమర్శలు చేస్తే సహించేది లేదు...

- నిరాధారమైన ఆరోపణలు సరికాదు
- ఉత్తమ్ దంపతులు అభివృద్ధికి అంకితం
- ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్

**హుజూర్ నగర్ సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర ప్రజా సంక్షేమమే ధ్యేయంగా హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు పద్మావతి రెడ్డి లపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య అడ్డగోలుగా విమర్శలు చేస్తే సహించేది లేదని ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హుజూర్ నగర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్,జెడ్ ఆర్ యు సి సి మాజీ మెంబర్ యరగాని నాగన్న గౌడ్ హెచ్చరించారు. బుధవారం హుజూర్ నగర్ లో ని ఆయన నివాసం లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగన్న గౌడ్ మాట్లాడుతూ..ఈనెల 19వ తేది న కోదాడ లో నిర్వహించ తలపెట్టిన మెగా జాబ్ మేళా ను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన వ్యాఖ్యలను నాగన్న గౌడ్ ఘాటుగా ఖండించారు. హుజూర్ నగర్,కోదాడ నియోజకవర్గాల అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్న ఉత్తమ్ - పద్మావతి దంపతులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ప్రజలే తమ పిల్లలుగా భావిస్తూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకై వారు చేస్తున్న కృషిని ఓరవలేని



బిఆర్ఎస్ నాయకులు విలువ లు లేని విమర్శలు, ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు ఆలకుంట్ల బాలకృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బంటు చుక్కయ్య, బెల్లంకొండ గురవయ్య, చిట్యాల అమర్ నాధ్ రెడ్డి, మేళ్లచెర్వు ముక్కంటి, మద్దం నాగేందర్, గుంటుక కరుణాకర్ రెడ్డి, సలి కంటి జానయ్య, ఇంటి అచ్చమ్మ, చప్పిడి సావిత్రి, చౌడం శివ పార్వతి,కత్తుల రవీందర్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమమే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం లక్ష్యం

- రాష్ట్ర నాయకుడు గుడిపాటి కోటయ్య

దామరచర్లలో ముమ్మరంగా సభ్యత్వాల నమోదు

**దామరచర్ల,సెప్టెంబర్ 16, (ప్రజాజ్యోతి):**

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం ( తపస్ ) పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గుడిపాటి కోటయ్య అన్నారు.దామరచర్ల మండలం లోని వివిధ పాఠశాలల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్ ) సభ్యత్వ అభయాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఎల్లప్పుడూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసమే పనిచేస్తుందని అందులో భాగంగానే పి ఆరు సి, డి ఏ తదితర పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ని కలిసి పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. కస్తూర్బా గాంధీ (కేజీబీవీ) ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని,010 పద్దుకింద వేతనాలు చెల్లించాలని కోరడం జరిగిందని వాటిని పరిష్కరించే వరకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డొంకల వెంకటేశ్వర్లు, కర్ణాటి రామిరెడ్డి, శ్రీనివాస్ నాయక్, దేవేందర్, జైపాల్ రెడ్డి, రాము, భాస్కర్ రెడ్డి, రాజు, యాదగిరి, శాంతకుమారి, రాధా, మంగమ్మ, కవిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా కొలను శ్రీనివాస్‌రెడ్డి

- హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్
- అభినందించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజయ్య, ఉద్యమ శ్రేణులు

**చౌటుప్పల్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ ఉద్యమకారుల యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా చౌటుప్పల్ మండలం అల్లపురం మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజయ్య ఆయనకు శాలువా కప్పి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పలువురు ఉద్యమకారులు శ్రీనివాస్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు వెల్లువెత్తించారు.ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమకారుల సమస్యలపై రాజీలేని



పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. మలిదశ ఉద్యమంలో ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి, వారి సంక్షేమానికి అండగా ఉంటానని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గుర్తింపు కార్డులు అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి దక్కేలా పోరాడతామని, జిల్లావ్యాప్తంగా ఉద్యమ శ్రేణులను ఏకం చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**నార్కట్ పల్లి , సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి):**

నార్కట్ పల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నార్కట్ పల్లి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జేరిపోతుల భరత్ కుమార్ హాజరై, తన చేతుల మీదుగా మొత్తం 22 మంది లబ్ధిదారులకు రూ. 22,24,552/- (ఇరవై రెండు లక్షల ఇరవై నాలుగు వేల ఐదు వందల యాభై రెండు రూపాయలు) విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి, ఐతరాజు యాదయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, బింగి కొండయ్య తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తాసిల్దార్ కార్యాలయ అధికారులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల కుటుంబాలకు అండగా ఈ-శ్రమ్ ఇన్సూరెన్స్

## - ఘనంగా 69 వ కార్మిక విద్యా దినోత్సవం

## - తెలంగాణ రీజినల్ డైరెక్టర్ ఎమ్మార్ దేశ్ పాండే

**హుజూర్ నగర్ సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**

వివిధ రంగాలలో పనిచేస్తున్నటువంటి సంఘటిత అసంఘటిత కార్మిక కుటుంబాలకు అండగా ఈ -శ్రమ్ ఇన్సూరెన్స్ నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ ఎమ్.ఆర్ దేశ్ పాండే అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవన్లో జాతీయ కార్మిక విద్యా దినోత్సవశీ సందర్భంగా ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ- శ్రమ్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఎమ్. ఆర్ దేశ్ పాండే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 100 మంది అసంఘటిత కార్మికులకు ఈ - శ్రమ్ కార్డు లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేషనల్ వర్కర్స్ ఎడ్యుకేషన్ డే ను ప్రతి కార్మికుడు పండుగల జరుపుకోవాలని, కార్మికుల హక్కుల చట్టాలను రక్షించుకోవడానికి అవగాహన కల్పించడశీ కోసం 1958వ సంవత్సరశీ సెప్టెంబర్ 16 న కార్మిక విద్యా సంస్థ ఇండోర్ లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఆ తర్వాత 1959లో హైదరాబాద్ లో ప్రారంభం జరిగిందన్నారు. 50 రీజనల్ డైరెక్టరేట్స్ తో కార్మికులకు వివిధ రంగాలపై శిక్షణ లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి దినం అభివృద్ధి చెందుతున్న కాలంతో పాటుగా కార్మికులకు



వారి హక్కులు, చట్టాలు గురించి కార్మిక విద్యాసంస్థల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా భారత కార్మిక రంగశీ అభ్యున్నతకై ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. 1991 లో వచ్చిన నూతన ఆర్థిక విధానాలతో కార్మిక రంగం లో అనేక మార్పులు వచ్చాయని గుర్తు చేశారు. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాలలోపు వివిధ రంగాలలో పనిచేసే కార్మికులందరూ కూడా ఈ -శ్రమ్ ఇన్సూరెన్స్ కార్డు చేయించుకోవాలని,ఈ- శ్రమ్ కార్డు ఉంటేనే మిగతా ఇన్సూరెన్స్ లు కూడా అలవోకగా కార్మిక కుటుంబాలకు అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎడ్యుకేషన్ ఆఫీసర్ డా. మహేశ్వర్ బాబు,సీనియర్ ఆఫీసర్ లు



సంశీర్, అభిలాష్, నరసింహ,సర్పంచ్ రాధా నాగరాజు, కౌన్సిలర్ సుష్మ మురళి,ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బంటు చక్కయ్య,నియోజకవర్గం అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య, బ్లాక్ అధ్యక్షులు చిట్యాల అమర్ నాధ్ రెడ్డి, మండల అధ్యక్షులు మేళ్లచెర్వు ముక్కంటి, పట్టణ అధ్యక్షులు మద్దం నాగేందర్, సలికంటి జానయ్య, గుంటుక కరుణాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కత్తుల రవీంద్ర, శ్రామిక మిత్రాలు సాయికుమార్, నాగేశ్వరరావు, అజయ్ కుమార్, ఇంటి అచ్చమ్మ, సప్పిడి సావిత్రి, చౌడం శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ఎన్నారై ఆపన్నహస్తం

**నార్కట్ పల్లి, సెప్టెంబర్16 (ప్రజా జ్యోతి):**



ఆపదల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం... కష్టాల్లో ఉన్న కుటుంబాలకు చేయూతనివ్వడమే నిజమైన సేవాభావం నకిరేకల్ నియోజకవర్గం, నార్కట్పల్లి మండలం, చెరువుగట్టు గ్రామంలో జూలై 25వ తేదీన షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామ పంచాయతీకి చెందిన షాపులు పూర్తిగా దగ్ధమై, భారీగా ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రమాదంతో పలువురు బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి అని అని అన్నారు. ఈ సంఘటనతెలిసిన వెంటనే రేగట్టే మల్లికార్జున్ రెడ్డి స్పందించి, అమెరికాలో ఉన్న ఎన్ఆర్ఐలకు చెరువుగట్టులో జరిగిన అగ్ని ప్రమాదం గురించి వివరించారు. బాధిత కుటుంబాలకు తమ వంతు సహాయం అందించాలని కోరారు. రేగట్టే మల్లికార్జున్ రెడ్డి చొరవతో ఎన్ఆర్ఐ పల్రెడ్డి ప్రవీణ్ రెడ్డి , ఉంద్రా ముఖేష్ రెడ్డి అందించిన ఆర్థిక సహాయం రూ. 7,06,000/- ను ఈరోజు రేగట్టే మల్లికార్జున్ రెడ్డి మరియు చెరువుగట్టు మాజీ సర్పంచ్ మల్గ బాలకృష్ణ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన ఎన్నారై దాతలకు, సహాయం అందించేందుకు చొరవ చూపిన రేగట్టే మల్లికార్జున్ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు నడింపల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు కడగంచి మంజుల శంకర్, చీర మధు, కోదూరు శివ, మోటి ప్రవీణ్, మచ్చ జగదీష్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వర్షపు చుక్కలను ఒడిసిపడదాం

## - భూగర్భ జలాల పెంపునకు జలసిరి బాట

## - ఎస్.లింగోటంలో ఫామ్ కుంట

## నిర్మాణానికి సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ భూమిపూజ



**చౌటుప్పల్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):**

కురిసిన ప్రతి వర్షపు చుక్కనూ వృథా పోనివ్వకుండా భూమిలోకి ఇంకింపజేస్తేనే సాగునీటి తిప్పల నుంచి గట్టెక్కగలమని తెలంగాణ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్.లింగోటం సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ పిలుపునిచ్చారు. బుధవారం ఎస్.లింగోటం గ్రామం శివుని బావి శేల్కలో 'జలసిరి' పథకం కింద చేపట్టనున్న ఫామ్ కుంట నిర్మాణ పనులకు ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రదీప్ జీ మాట్లాడుతూ.. వర్షాలు ఎప్పుడు కురుస్తాయో చెప్పలేమని, కానీ కురిసిన నీటిని ఒడిసిపట్టి దాచుకోవడం మాత్రం రైతుల చేతుల్లోనే ఉందన్నారు. పొలాల్లో ఫామ్ కుంటలు తవ్వుకోవడం ద్వారా నీటి నిల్వ పెరిగి, భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. ఫలితంగా వర్షాధార పంటలకు జీవం పోసినట్లవుతుందని, రైతులంతా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాతరాజు ధనంజయ్య, పంచాయతీ కార్యదర్శి మచ్చగిరి, ఫీల్డ్ అసిస్టెంట్ కళమ్మ, వార్డు సభ్యులు ఉప్పు వీరేశం, పిట్టల సదానందం, శోభ, పల్చం శంకరయ్య, బాతరాజు లింగస్వామి, శనగోని సుశీల, తూర్పింటి సుజాత, షేగురి లింగస్వామి, రాధారపు సత్తయ్య, గ్రామ పెద్దలు, అన్నదాతలు పాల్గొన్నారు.

# హాలియాలో డీజే రహితంగా గణేష్ నిమజ్జనం

## - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## - ఎస్ ఐ బండి.సాయి ప్రశాంత్






**హాలియా,సెప్టెంబర్16(ప్రజా జ్యోతి)**

హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జన వేడుకలను డీజే రహితంగా,ప్రశాంత వాతావరణంలో సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత ముందస్తు చర్యలు చేపట్టిందని హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ తెలిపారు. నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ జి.రవి, హాలియా సీఐ ఎస్. రాఘవరావుల పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్‌లో నమోదైన 211 వినాయక మండపాలకు జియో ట్యాగింగ్ ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు.దీని ద్వారా మండపాల వద్ద పోలీసుల గస్తీ,పర్యవేక్షణ తోపాటు నిమజ్జనం సమయంలోనూ సమర్థవంతమైన భద్రతను అందించనున్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా రౌడీ షీటర్లు,డీజే నిర్వాహకులు,యజమానులను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.పట్టణంతో పాటు అనుముల మండల పరిధిలో ఉదయం,సాయంత్రం,రాత్రి వేళల్లో బ్లూకోల్ట్స్,పోలీస్ గస్తీ వాహనాలు నిరంతరం నిఘా ఉంచుతాయని చెప్పారు.అలీనగర్ చెక్‌పోస్ట్ సమీపంలోని 14వ మైలు వద్ద విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.నిమజ్జన ఊరేగింపుల్లో అధిక శబ్దాలు చేసే డీజేలను పూర్తిగా నిషేధించినట్లు అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఉపయోగిస్తే సౌండ్ సిస్టమ్‌లను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక మండపాల నిర్వాహకులు,భక్తులు పోలీస్ శాఖకు సహకరిస్తూ,సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంతంగా,శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ సాయి ప్రశాంత్ కోరారు.




# కన్నులపండువగా గణనాథుని కల్యాణం

## - కొయ్యలగూడెం శ్రీ వరసిద్ధి వినాయక ఆలయంలో ఘనంగా ఉత్సవాలు

## - ప్రత్యేక పూజల్లో డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి.. భక్తులకు స్వయంగా అన్నవితరణ

## - భక్తులతో మార్మోగిన ఆలయ ప్రాంగణం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం రెవెన్యూ శివారు, జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) పక్కన కొలువైన శ్రీ వరసిద్ధి వినాయక ఆలయంలో వినాయక కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే ఆలయంలో గణపతి హోమం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై స్వామివారిని దర్శించుకునేందుకు చౌటుప్పల్ పట్టణంతో పాటు మండల పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ మహోత్సవానికి చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలు వర్ధిల్లాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్వాహకులు డీఎస్పీని శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామివారి శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.కల్యాణోత్సవం ముగిసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని డీఎస్పీ ప్రారంభించి, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఆలయ పరిసరాలన్నీ భక్తుల జయజయధ్వానాలు, నామస్మరణలతో మార్మోగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భూమి విలువ కోట్లలో.. పరిహారం లక్షల్లోనా?

## - మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలి

## - రైతుల డిమాండ్





**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి):** ఎన్‌హెచ్-930పీ రహదారి నిర్మాణం కోసం భూసేకరణకు గురైన తమ భూములకు ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా న్యాయమైన, సముచిత పరిహారం చెల్లించే వరకు ఒక్క అడుగు కూడా నిర్మాణ పనులు ముందుకు సాగనివ్వకూడదని పోచంపల్లి, వలిగొండ మండలాల రైతులు డిమాండ్ చేశారు.ప్రస్తుతం తమ భూములకు ఎకరాకు రూ.11 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు మాత్రమే పరిహారం నిర్ణయించడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల మార్కెట్ విలువ కలిగిన భూములను లక్షల రూపాయల పరిహారానికి తీసుకోవడం తమకు తీవ్ర నష్టం కలిగించడమేనని వారు పేర్కొన్నారు.భూముల ప్రస్తుత మార్కెట్ విలువ, అదే ప్రాంతంలో జరుగుతున్న ఇతర భూసేకరణల్లో చెల్లిస్తున్న పరిహారాన్ని పరిగణనలోకి తీసుకుని తమకు సమానత్వంతో కూడిన న్యాయమైన పరిహారం నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణలో ఇస్తున్న పరిహారాన్ని ప్రాతిపదికగా తీసుకుని తమకు కూడా తగిన పరిహారం అందించాలని కోరారు.పరిహారంపై అర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తై తుది నిర్ణయం వెలువడే వరకు భూముల్లో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని రైతులు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకుండా పనులు కొనసాగిస్తే తమ భూములను కోల్పోయి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు రైతులు మండల తహసీల్దార్ అధికారికి వినతిపత్రం సమర్పించి, మార్కెట్ విలువకు తగ్గ పరిహారం నిర్ణయించి న్యాయం చేసిన తర్వాతే రహదారి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులలో భాష,గణిత సామర్థ్యాలు పెంచాలి

## - జిల్లా విద్యాశాఖాధికారి సుసింధర్ రావు





**అనుముల,సెప్టెంబరు16(ప్రజా జ్యోతి)** విద్యార్థులలో భాషా సామర్థ్యాలు,గణిత కనీస సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నల్గొండ జిల్లా విద్యాశాఖాధికారి సుసింధర్ రావు ఆదేశించారు.బుధవారం అనుముల మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అనుములను ఆయన ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్‘ నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పర్యవేక్షించడంతో పాటు, ఉపాధ్యాయుల బోధనా విధానం ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరా తీశారు.ఈ సందర్భంగా డీఈఓ సుసింధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులందరూ ప్రాథమిక భాషా వికాసంతో పాటు గణితంలో అవసరమైన కనీస సామర్థ్యాలను తప్పనిసరిగా సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును రూపుదిద్దడంలో ఉపాధ్యాయులందరూ సమిష్టిగా శ్రమించాలని పిలుపునిచ్చారు.పాఠశాలల విద్యా ప్రణాళికలో భాగంగా ఫార్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు. ఆ వెంటనే రాబోయే సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలకు విద్యార్థులను సర్వసన్నద్ధం చేయాలని కోరారు.ప్రతి అసెస్మెంట్ పూర్తయిన వెంటనే విద్యార్థుల మార్కులు,అభ్యసన ప్రగతికి సంబంధించిన ‘ప్రోగ్రెస్ రిపోర్టులను‘తప్పనిసరిగా వారి తల్లిదండ్రులకు అందజేసి,పిల్లల చదువుపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రంగా లక్ష్మమ్మ నివాళులర్పించిన సర్పంచ్ భరత్ కుమార్

**నార్కట్ పల్లి, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రానికి చెందిన రంగా లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన నార్కెట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ , ఈ కార్యక్రమంలోనార్కెట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాయం శ్యామ్ సుందర్ రెడ్డి , యానాల రాంరెడ్డి , వేముల సత్తయ్య 7వ వార్డు సభ్యులు జిల్లా మహేష్ , మైనారిటీ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. సమద్ , ఎస్.కె. బషీర్ , యానాల సతీష్ , ఇడుగుల సంపత్ , దేవరాశెట్టి నారాయణ , తడకమళ్ల బిక్షం , పసునూరి పాండు రంగయ్య ,పసునూరి రమేష్ , మరియు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వంశీ నాయి బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

**వలిగొండ సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి న్యూస్):** ప్రభుత్వం నాయి బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంగం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేల్లి వలి అన్నారు. బుధవారశీ ప్రపంచ నాయి బ్రాహ్మణ దినోత్సవసం సందర్భంగా వారి కుల దైవం అయిన ధనవంతురి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కేకు కత్తిరించి శుభాకాంక్షలు తెలుపుకొని మాట్లాడుతూ మనిషి పుట్టుక నుండి మరణం వరకు సేవ చేసేది నాయి బ్రాహ్మణులేనని, ప్రభుత్వం నాయి బ్రాహ్మణులను గుర్తించి 50 సంవత్సరాలు నిండిన ప్రతి నాయి బ్రాహ్మణులకు ఆసరా పెన్షన్ అందించాలని, వారికి ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాచమల్ల విజయ్, నాగేల్లి కృష్ణ నాగేల్లి నాగేష్, నాగేల్లి పాండు, రాచమల్ల ఉమాపతి, నాగేల్లి ప్రభాకర్, జంపాల భార్గవ్, రాచమల్ల వినోద్, కడారి దయాకర్, దడిపల్లి సతీష్, రాచమల్ల ప్రభాకర్, జంపాల మధు, రాచమల్ల దినేష్, నాగేల్లి భాను, ప్రజ్ఞాపూర్ విగ్నేష్, కడారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



# ఓజోన్ పొర పరిరక్షణే భవిష్యత్ తరాలకు రక్షణ

## తాసిల్దార్ నేలపట్ల నరేష్



సోషల్ ఫోరం స్థాపకులు జీడిమెట్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట నరసింహాచారి, నల్గొండ జిల్లా అధ్యక్షులు జిట్ట గోని వెంకటేశం, మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు కోణం రమేష్ ,మండల అధ్యక్షులు బొల్లం శ్రీశైలం, విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు జె రమేష్,బీ సీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు జి వెంకటాచారి, తీరం దాస్ సత్తయ్య, రావుల శీను ప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మునుగోడు, సెప్టెంబర్, 16, ప్రజా జ్యోతి**

మునుగోడు మండల కేంద్రంలోని సత్యం ఫంక్షన్ హాల్ లోని ఇండియన్ ఎన్విరాన్మెంట్ సోషల్ ఫారం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాసిల్దార్ నేలపట్ల నరేష్ విచ్చేశారు అనంతరం మాట్లాడుతూ సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై జీవరాశులను ఓజోన్ పొర రక్షిస్తుందని తెలిపారు. ఓజోన్ పొరను దెబ్బతీసే కాలుష్య కారకాలను నియంత్రించడంతో పాటు పర్యావరణహిత జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.వాతావరణ మార్పులు, కాలుష్యం వంటి పర్యావరణ సమస్యలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం వంటి చర్యలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.ఓజోన్ పొరను కాపాడుకుందాం భూమిని రక్షించుకుందాం భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందిద్దాం అని సదస్సులో సందేశం ఇచ్చారు.సదస్సులో ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టి మల్లేశం, ఫారెస్ట్ రేంజ్ అధికారి కె సుచరిత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ బాల ప్రసాద్, ఇండియన్ ఎన్విరాన్ మెంట్

# పోలీస్ స్టేషన్లో గణనాధునికి డీఎస్పీ మధుసూదన్ రెడ్డి ప్రత్యేక పూజలు

**రామన్నపేట సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)**

రామన్నపేట: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ ఐ గోపాతి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్య పూజలకు బుధవారం రోజున డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మెలుగు రవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# రైతాంగ హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలు

### - కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ధ్వజం

### - వినూత్న ర్యాలీతో ఆకట్టుకున్న అన్నదాతలు

**చింతలపాలెం, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి) :**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా అన్నదాతలు, కార్మికులు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ పిలుపునిచ్చారు. 36వ రైతు సంఘం వారోత్సవాల సందర్భంగా చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు నిర్వహించిన వినూత్న ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రైతులు సంప్రదాయ పంచకట్టు ధరించి, 33 ట్రాక్టర్లు, మూడు ఎడ్లబండ్లతో ప్రదర్శనగా ముందుకు సాగారు. అనంతరం రైతాంగ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజూ కృష్ణన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాల నిర్ణయాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరల అమాంతం పెరుగుదలతో రైతులపై పెట్టుబడి భారం మోయలేని స్థాయికి చేరిందన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకే గతంలో రద్దు చేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను. ఇతర మార్గాల్లో దొడ్డిదారిన అమలు చేయడానికి కేంద్రం కుట్రలు పన్నుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు.పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, డాక్టర్ ఎం.ఎస్.



స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన 'సీ2+50 శాతం' ఫార్ములాను తక్షణమే అమలు చేయాలని విజూ కృష్ణన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను, ముఖ్యంగా మల్లారెడ్డిగూడెం ప్రాంతంలో రైతులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, మాజీ ఎమ్మెల్యే, కిసాన్ సభ జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, తీగల సాగర్, జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి, రాష్ట్ర నాయకుడు పల్లె వెంకటరెడ్డి వట్టేపు సైదులు, కందుల సుందరమౌలేష్ రెడ్డి, జంగాల పుల్లయ్య, అనంతప్రకాశ్, సీలం శ్రీను, కరమగౌండ్ల నగేష్, తుగ్గి బ్రహ్మం, ఎస్కే మక్బుల్, తదితర రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గణనాథుడి నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన

### - అడిషనల్ ఎస్పీ జి రమేష్




**సెప్టెంబర్ 16 వేములపల్లి (ప్రజాజ్యోతి) :-**

ప్రస్తుత గణేశ్ ఉత్సవాల సంధర్బంగా బుధవారం నల్గొండ అడిషనల్ ఎస్పీ జి. రమేశ్ , వేములపల్లి లోని ఎన్ ఎస్ పి ఎడమ కాలువ వద్ద గల నిమ్మజ్జన ఏర్పాట్లను పరిశీలించి, అదికారులకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగినది. అనంతరం వేములపల్లి లోని వినాయక మండపాలను సందర్శించి పోలీస్ వారు తనికి నిమ్మిత్తము ఏర్పాటు చేసిన పాయింట్ బుక్ లను పరిశీలిచి మరియు ఉత్సవ కమిటీ వారికి డిజెల నిషేదం గురించి వివరించడం జరిగినది, అనంతరరరం ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇట్టి కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ సీఐ సిఎన్డి ప్రసాద్ , వేములపల్లి ఎస్ ఐ వెంకటేశ్వర్లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# కోళ్ల దాణా ను కల్తీ చేస్తున్న కేటుగాళ్లు....!

## - నిఘా పెట్టి 2 డి సి ఎం లు పట్టుకున్న అసోసియేషన్ సభ్యులు





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 16,(ప్రజాజ్యోతి) :**

కాదేది కల్తీకి అనర్హం అన్నట్టుగా... కోళ్ల దానాలు కల్తీ చేస్తూ... అక్రమంగా దండుకుంటూ... కోళ్ల ఆరోగ్యాన్ని... తద్వారా మనుషుల ఆరోగ్యాన్ని చిద్రం చేస్తూ... జేబులు నింపుకుంటున్న కల్తీరాయుళ్ల ఆట కట్టించారు పౌల్ట్రీ అసోసియేషన్ సభ్యులు... అధికారులకు ఫిర్యాదు చేసినా... స్పందన లేకపోవడంతో తామే స్వయంగా రంగంలోకి దిగి రెండు డీసీఎంలను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించిన సంఘటన బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు సమీపంలో జరిగింది. స్థానికులు, పౌల్ట్రీ రైతులు తెలిపిన వివరాల మేరకు 2 డి సి ఎం లలో అక్రమంగా తరలిస్తున్న కల్తీ కోళ్ల దాణాను తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ బృందం పట్టుకుంది.రెండు డీసీఎం వాహనాల్లో తరలిస్తున్న దాదాపు 30 టన్నుల కల్తీ దాణాను రైతులు పట్టుకొని,స్థానిక పోలీసులకు అప్పగించారు.ఇటీవల మార్కెట్‌లో కోళ్ల దాణా ధరలు గణనీయంగా పెరగడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు ఈ దందాకు తెరలేపినట్లు పౌల్ట్రీ రైతులు ఆరోపిస్తున్నారు.ఈ దాణాలో దాదాపు 60 శాతం వరకు రాయి పొడి,వరి పొట్టు కలపి విక్రయిస్తున్నట్లు వారు గుర్తించారు.మిర్యాలగూడ కేంద్రంగా హాలియా, ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు ఈ కల్తీ దాణా భారీగా సరఫరా అవుతోందని రైతులు తెలిపారు. అనుమానంతో



కొంతకాలంగా నిఘా ఉంచిన పౌల్ట్రీ రైతులు, ఈరోజు వాహనాలను చాకచక్యంగా పట్టుకున్నారు.కల్తీ దాణా తినడం వల్ల కోళ్లకు లివర్, కిడ్నీ సంబంధిత సమస్యలు వచ్చి పెద్ద ఎత్తున చనిపోతున్నాయని పౌల్ట్రీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.దీనివల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర నష్టాల్లో కూరుకుపో తోందని తెలిపారు. మాంసం ప్రియులు అనారోగ్యం బారిన పడిన కోళ్లను తినడం ద్వారా వారు కూడా అనేక జబ్బుల బారిన పడే అవకాశం లేకపోలేదని వాపోయారు.కల్తీ రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి నిఘా పెంచాలని పౌల్ట్రీ ఫామ్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

# కంచనపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా జక్క రవీందర్ రెడ్డి

**వలిగొండ, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి న్యూస్):**

మండలంలోని కంచనపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా జక్క రవీందర్ రెడ్డిని నూతన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు.బుధవారం గ్రామ సర్పంచ్ రేసు బుచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ అభివృద్ధి కమిటీ కార్యవర్గ సమావేశంలో జక్క రవీందర్ రెడ్డిని చైర్మన్ గా ఉపాధ్యక్షులుగా మంచోజు విజయకుమార్, చిట్యాల జంగయ్య, ప్రధాన కార్యదర్శి జక్క రఘుపతి రెడ్డి, కోశాధికారిగా గంగారం రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా ఎన్నికైన జక్క రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి తో పాటు గ్రామంలోని విద్యాభివృద్ధికి కమిటీ గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజల సహకారంతో ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ పిఎసిఎస్ వైస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి, ఉప సర్పంచ్ ఈరపాక సుధాకర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

## - కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోనే వీర తెలంగాణ రైతాంగ పోరాటం : సీపీఎం

**వలిగొండ సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి న్యూస్):**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన మహోన్నత పోరాటమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను సహించేది లేదన్నారు.బుధవారం సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పహిల్వాన్‌పురం, రెడ్లరేపాక, మొగిలిపాక గ్రామాల్లోని అమరవీరుల స్థూపాల వద్ద పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభల్లో వారు మాట్లాడుతూ.. నాటి పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున ఉద్యమించారని తెలిపారు. ఈ ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలు పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు.కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చీర్క శ్రీశైలం రెడ్డి, కల్మూరి రాంచందర్, మొగిలిపాక గోపాల్, కొండె క్రిష్టయ్య, కవిడే సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ మహిళలకు శుభవార్త.. గడువు పెంపు

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి):**

బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టుమిషన్' పథకం దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆటోమేటిక్ కుట్టుమిషన్లు ఉచితంగా/రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న మహిళలు టి.జి. ఓ.బి.ఎమ్. ఎమ్. ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



# ఘనంగా గణనాథుని పూజలు శ్రీ బప్ప గణేష్ యూత్

**రామన్నపేట సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి):**

రామన్నపేట పట్టణ కేంద్రంలో మేరు వాడలో బుధవారం రోజున శ్రీ బప్పా గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా లవణం బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించినారు .ఈ కార్యక్రమంలో సింగరాజు యశ్వంత్, సుమంత్, సోమ యశ్వంత్, బండ వెంకటేష్, ముగ్గు అక్షయ్, లవణం విశ్వ సాయి, లవణ ప్రతీక్, గంగుల శ్రీధర్ రెడ్డి, సోమ బాబా సాయి, లవణం చరణ్ సాయి, తదితరులు పాల్గొన్నారు.



# నాటి సాయుధ పోరాటమే స్ఫూర్తిగా...

## నయా జమీందారులకు వ్యతిరేకంగా పోరాడ డమే నేటి కర్తవ్యం

### - రైతు సంఘం జాతీయ కార్యదర్శి విజ్జుకృష్ణన్



**మిర్యాలగూడ,సెప్టెంబర్ 16, (ప్రజాజ్యోతి):** భూమికోసం, భుక్తి కోసం మానవాళి విముక్తి కోసం నాడు జరిగిన తెలంగాణ సాయుధరైతాంగ పోరాటం ఆదర్శనీయ మనిఆ స్ఫూర్తితో నేటి నయా జమీందారులకు వ్యతిరేకంగా పోరాటమే కర్తవ్యమని అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శి విజ్జు కృష్ణన్ అన్నారు . బుధవారంమిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ కార్యక్రమం ఏఐకేఎస్ జాతీయ మహాసభలు జయప్రదం కోసం జరిగిన ఫండ్ క్యాంపెనింగ్ లో ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్,కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు. మొదటగా గ్రామంలోనిఅమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి, అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటం సాధారణ మహిళ సహితం జమీందారు గూండాలకు వ్యతిరేకంగా నిలబడి పోరాడే విధంగా తయారుచేసిందన్నారు. నిజాం నిరంకుశ పాలనలో వారికి గులాములుగా జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు జెన్నారెడ్డి ప్రతాపరెడ్డి, విసునూర్ రామచంద్రారెడ్డి లాంటి దుర్మార్గులున్నారని, వారి ఆగడాలకు వ్యతిరేకంగా తొలి అమరుడు దొడ్డి కొమరయ్య, వీరనారి చిట్యాల ఐలమ్మ, వీరోచితంగా పోరాడారన్నారు. సాయుధ పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్ట్ లు పేదలకు పంచారని, 4వేల గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేశారని అన్నారు . దేశవ్యాప్తంగా భూసంస్కరణలు, భూదాన ఉద్యమానికి పూనుకోవాల్సిన పరిస్థితిని ఈ పోరాటం కల్పించిందని అన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నయా జమీందారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నదని, చిన్న, సన్నకారు రైతుల నుండి బలవంతపు భూసేకరణ కోరుకుంటున్నదని, 2013 భూ సేకరణ చట్టాన్ని, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా రైతులను భూముల నుండి బేదఖలు చేస్తున్నదన్నారు. ఖనిజ సంపదను బడా




కార్పొరేట్లకుకట్టబెట్టేందుకు పూనుకుంటున్నద న్నారు.నల్లగొండలో జరిగే అఖిల భారత మహాసభలనుజయప్రదం చేయాలన్నారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్, అఖిలభారత కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, టాప్రా జిల్లా అధ్యక్షులు నూకల జగదీశ్ చంద్ర, గూడూరు సర్పంచ్ బొగ్గారపు కృష్ణయ్య, ఐద్వా నాయకులు వరలక్ష్మి, గోవర్ధన, అరు, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.